













యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

కంబాలచెరువు: ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) డైరీ, క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు మంగళవారం ఆవిష్కరించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయకర్, ఏ.షరీఫ్ నేతృత్వంలో స్థానిక డీఈవో కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.















కోటి కాంతులు.. కొత్త ఆశలు

- నూతన ఏడాదికి ఘన స్వాగతం
- కిటకిటలాడిన మార్కెట్లు
- జోరుగా పండ్లు, పూలు కొనుగోలు

రాజమహేంద్రవరం సిటీ: నూతన సంవత్సరానికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఎన్నో అనుభవాలను అందించిన 2024కు వీడ్కోలు పలుకుతూ, కొత్త ఆశలు, కొంగొత్త ఆకాంక్షలతో 2025కు సుస్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి మార్కెట్‌లో జోష్ నెలకొంది. స్వీట్ షాపులు, పూల దండలు, పుష్పగుచ్ఛాలు కొనేందుకు ప్రజలు పోటీ పడ్డారు. ఇక బిర్యానీ దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.



కడియంలోని సత్యనారాయణ నర్సరీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు

కడియం: కడియంలోని సత్యనారాయణ నర్సరీ గార్డెన్స్‌లో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేల మొక్కలతో అందమైన కూర్పును ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల పాటు దాదాపు 30 మంది కార్మికులు శ్రమించి ఈ ఏర్పాట్లు చేసినట్టు నర్సరీ రైతు గణపతి తెలిపారు.

సత్యదేవ నర్సరీ సందర్శన

కడియం: కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన సత్యదేవ నర్సరీని ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక మంగళవారం సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పెద్ద సత్యనారాయణ ఘనంగా స్వాగతం పలికి, వివిధ రకాల మొక్కల గురించి వివరించారు.



పేపరుమిల్లులో ఉన్నతాధికారి అరాచకాలు

సీటీఆర్ఐ: రాజమండ్రి పేపరుమిల్లులో ఓ ఉన్నతాధికారి అరాచకాలు విపరీతంగా పెరిగిపోయాయని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు ఆరోపించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపరుమిల్లులో మూడేళ్లుగా ఓ అధికారి తీరుతో ఉద్యోగులు అభద్రతకు గురవుతున్నారన్నారు. అతడి వేధింపులు తట్టుకోలేక ఒక పర్మినెంట్ కార్మికుడు ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని, మరో ఇద్దరు ఉద్యోగులు 40 ఏళ్లు నిండకుండానే అర్ధాంతరంగా మృతి చెందారని తెలిపారు. కొద్దికాలం క్రితం ఒక కాంట్రాక్ట్ మహిళా కార్మికురాలికి మాయమాటలు చెప్పి, మోసం చేశాడన్నారు. అతడిపై ఫ్యాక్టరీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్ర హోం మంత్రికి ఫిర్యాదు చేస్తామని కొండబాబు హెచ్చరించారు. అప్పటికీ న్యాయం జరగకుంటే ప్రజా ఉద్యమంతో పాటు న్యాయ పోరాటానికి సిద్ధమవుతామన్నారు.

ఘనంగా జీఎస్‌కేఎం లా కళాశాల స్నాతకోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: మహోన్నత ఆశయాలతో ప్రముఖ విద్యావేత్త, స్త్రీవాది శారదారావు జీఎస్‌కేఎం లా కళాశాలను స్థాపించారని, న్యాయవిశ్వవిద్యాలయంగా ఈ కాలేజీ ఎదగాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కవలగొయ్యిలోని జీఎస్‌కేఎం లా కళాశాల 40వ వార్షికోత్సవం, స్నాతకోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలు, పతకాలను ప్రదానం చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ కళాశాల ఉన్నత ప్రమాణాలతో నడుస్తూ, సమున్నత శిఖరాలు అధిరోహించిందన్నారు. కళాశాల డైరెక్టర్ శరత్ కృష్ణ మాట్లాడుతూ తమ నానమ్మ శారదారావు ఎంతో కష్టపడి కళాశాలను స్థాపించారని, ఆమె అడుగుజాడలలో నడుస్తూ మరింత ముందుకు తీసుకువెళతానన్నారు.

4న వేమగిరిలో గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్

కడియం: గేమ్ చేజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను వేమగిరిలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్నట్టు రాష్ట్ర చిరంజీవి రామ్ చరణ్ యువత కమిటీ సభ్యుడు ఏడిద బాబీ తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం మహానాడు నిర్వహించిన మైదానాన్ని ఏ మీడియా చైర్మన్ నరేంద్ర పరిశీలించారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. హీరో, హీరోయిన్లు రామ్ చరణ్, కియారా అద్వానీ, అంజలి, దర్శకుడు శంకర్, నిర్మాత దిల్ రాజు సంగీత దర్శకుడు తమన్ హాజరవుతారన్నారు.



ఆ సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలి

కంబాలచెరువు: అనంతపురంలో న్యాయవాది శేషాద్రి మృతికి కారకుడైన సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ నుంచి సబ్ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గోకవరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉత్సాహంగా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

కంబాలచెరువు: విద్యా,వైజ్ఞానికి ప్రదర్శనలు మంగళవారం ఘనంగా జరిగాయి. అర్బన్ మండలానికి సంబంధించి ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రదర్శనను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జేఎస్ఎస్ శ్రీనివాసరావు అధ్యక్షతన మండల స్థాయి సదరన్ సైన్స్ ఫెయిర్‌ను ఎంఈవోలు ఏఆర్‌కేడీ తులసీదాస్, బి.కిరణ్ చందుకుమార్ ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను తిలకించారు.

కడియం: మానవ మనుగడకు విజ్ఞాన శాస్త్రమే మూలమని ఎంఈవో కె.నాగేశ్వరరావు అన్నారు. ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం మండల స్థాయి సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ జరిగింది.

క్రీడాకారులకు అభినందనలు

రాజమహేంద్రవరం సిటీ: చదువుతో పాటు క్రీడలపై కూడా విద్యార్థులు దృష్టి సారించాలని వీరేశలింగం పుర మందిరం (టౌన్ హాల్) ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మద్దూరి శివసుబ్బారావు పిలుపు నిచ్చారు. గత వారం కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని చాంపియన్లుగా నిలిచిన రాజమహేంద్రవరం గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీ క్రీడాకారులను మంగళవారం టౌన్ హాల్‌లో సత్కరించారు. వారికి నగదు ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కోచ్ వీటీవీ సుబ్బారావు, నగర ప్రముఖులు పంతం కొండలరావు, జగన్నాథం వెంకటరెడ్డి, రెడ్డి రాజు, ఆకుల విజయకుమార్ పాల్గొన్నారు.

